## క్లుప్తంగా

### గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ



కంచికచర్ల: మండలంలోని గండేపల్లి, కీసర గ్రామాల్లో గురువారం శానిటేషన్ పనులు చేపట్టామని పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో మురుగునీరు పారుదల కోసం డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించామని, బ్లీచింగ్, సున్నం చల్లించామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా తగు చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు రోగాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఇళ్లలో ఉన్న చెత్తను రోడ్లపై వేయకుండా ఇంటి ముంగిటకు వచ్చే చెత్త సేకరణ బండిపై వేయాలని అన్నారు. వేసవికాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రజలు అత్యవసరమైన పనులుంటే తప్ప బయటకు రావద్దని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### 500 మందికి వైద్య పరీక్షలు



పెనుగంచిప్రోలు: స్థానిక పశువైద్యశాల ఆవరణలో గురువారం హైదరాబాద్‌కు చెందిన గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వారిచే జేజీఎం చర్చి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్, క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మందికి పరీక్షలు నిర్వహించటంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ క్యాన్సర్‌కు సంబంధించి ముందస్తు పరీక్షలు చేయించుకోవటం ఉత్తమం అన్నారు. ప్రజలు శారీరక వ్యాయామంతో పాటు యోగా చేయటం, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జేజీఎం చర్చి పాస్టర్ జోషప్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన ర్యాలీ

వత్సవాయి: పౌష్టికరమైన ఆహారానికి నిలయాలు అంగన్‌వాడీ కేంద్రాలని సర్పంచ్ భూక్యా సీతమ్మ, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి చెప్పారు. గురువారం జన భాగీధారీ కార్యక్రమంలో భాగంగా వత్సవాయి, పోల్కంపల్లి, మక్కపేట, మంగొల్లు గ్రామాల్లో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి చిన్నారి ఆరేళ్ల వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండాలన్నారు. ఈ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికరమైన ఆహారం చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీవో నాగమణి, సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, బీబీజాన్, శారద తదితరులు పాల్గొన్నారు.

### తల్లులకు ప్రీస్కూల్ విద్యపై అవగాహన



కొణకంచి(పెనుగంచిప్రోలు): జనభాగీదారీ కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లులకు అవగాహన కల్పించటంతో పాటు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోనెల దేవి, ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి కె.వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### 17 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

నందిగామ: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. డెప్యూటీ తహసీల్దార్ కె.రామ్మూర్తి రెడ్డి తెలిపిన సమాచారం ప్రకారం పట్టణ శివారు అనాసాగరం ప్రాంతం నుంచి రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి ఓ మినీ లారీలో తరలిస్తున్న 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రేషన్ షాప్‌కు అప్పగించారు. సదరు వ్యాపారిపై కేసు నమోదు చేయడంతో పాటు రేషన్ తరలించేందుకు వినియోగించిన లారీని సీజ్ చేశారు.

### అజరామరం శ్రీశ్రీ కవిత్వం

తిరువూరు: ప్రజా సమస్యలను తన రచనల ద్వారా సమాజానికి తెలియజేసిన అభ్యుదయ రచయిత మహాకవి శ్రీశ్రీ అని తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్ర కన్వీనర్ కడిమి పాపారావు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో గురువారం శ్రీశ్రీ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి నిర్వహించారు. అణగారిన వర్గాల పక్షాల నిలబడి అభ్యుదయ వాదిగా పేరుగాంచిన శ్రీశ్రీ తెలుగు సాహితీలోకంలో ధ్రువతారగా మిగిలిపోయారన్నారు. శ్రీశ్రీ చిత్రపటానికి అధ్యయన వేదిక సభ్యులు పంతంగి శ్రీనివాసరావు, పి.శోభన్‌బాబు, గంగాధర్, రంగారావు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

# జగనన్న పాలనలో రాష్ట్రంలో చదువుల విప్లవం

- ప్రభుత్వ విప్ ఉదయభాను
- నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం



ఉత్తమ విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, డీఈవో రేణుక తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చదువుల విప్లవం తీసుకువచ్చారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక అద్దాలబజారులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో గురువారం జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే ఉదయభాను డీఈవో సీవీ రేణుకతో కలసి ప్రశంసా పత్రాలను, నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రూ.2 లక్షల 16 వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లు విద్యకే కేటాయించడం ద్వారా చదువుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ఫలితంగా నేడు ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలు ద్వారాలకు అడ్మిషన్స్ ఫుల్, నో అడ్మిషన్స్ అనే బోర్డులు పెడుతున్నారన్నారు. ఈ ఏడాది పది, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే ఎక్కువ మార్కులు సాధించడం గమనార్హం అన్నారు. ఈ విషయాన్ని అందరికీ తెలియజేయడం ద్వారా మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా ఉండేందుకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ఏర్పాటుచేశారన్నారు.

**విద్యార్థులను ప్రోత్సహించేందుకే పురస్కారాలు: డీఈవో రేణుక**

ప్రభుత్వ పాఠశాలలను, విద్యార్థులను ప్రోత్సహించి వారికి సమాజంలో మంచి గౌరవ ప్రతిష్టలు పెంచేందుకే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేశారని డీఈవో సీహెచ్ రేణుక అన్నారు. నాణ్యమైన విద్య కోసం ఇంగ్లిష్ మీడియం, ట్యాబ్‌లు, ప్రైమరీలో ప్రతి క్లాస్ రూమ్‌లో స్మార్ట్ రూమ్, ప్రతి స్కూల్‌కు ఇంటర్‌నెట్ వంటి సౌకర్యాలను కల్పించారని తెలిపారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వత్సవాయి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మోదెల శారద(575 మార్కులు)కు ప్రశంసాపత్రంతో పాటు రూ.15 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన నందిగామ మండలం మాగల్లు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి జిల్లేపల్లి అరవింద్(572 మార్కులు)కు రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన పెనుగంచిప్రోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి రేగండ్ల నాగ త్రిశూల్(571 మార్కులు)కు రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన పేటలోని బాలికల గురుకుల పాఠశాలకు చెందిన కందుల జస్విత(571)కు రూ.5 వేల చొప్పున అందజేశారు. ఇంటర్మీడియెట్‌లో పేట బాలికల గురుకుల కళాశాలకు చెందిన కోట ఉదయశ్రీ(953 మార్కులు)కు రూ.15 వేలు నగదు, ప్రశంసాపత్రాలతో అతిథులు సన్మానించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కూడా అభినందించారు. ఎంఈవో రవీంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు రాఘవేంద్ర, తుమ్మల ప్రభాకర్, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, ఎంపీపీ మార్కపూడి గాంధీ, పేట, వత్సవాయి తహసీల్దార్లు సూర్యారావు, వైకుంఠరావు, వత్సవాయి ఎంఈవో నాగరాజు, కౌన్సిలర్ కొలగాని రాము, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆవాల భవానీప్రసాద్, మొహిద్దీన్, బద్దూనాయక్, చారుగుండ్ల కొండ, కోఆప్షన్ సభ్యులు సాయి చైతన్య శర్మ, ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

## సీఎం భుజస్కందాలపై విద్యార్థుల భవిష్యత్తు



విద్యార్థులను సత్కరించి సర్టిఫికెట్, నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: తల్లిదండ్రుల ఆశయాలు, ఆకాంక్షల మేరకు విద్యార్థులకు మంచి చదువు అందించటం, వారి బంగారు భవిష్యత్తుకు మార్గం చూపించే భారాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన భుజస్కందాలపై మోస్తున్నారని శాసనసభ్యుడు జగన్‌మోహనరావు అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి, ఇంటర్‌మీడియెట్ పరీక్షలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన ఘనంగా సత్కరించి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ముఖ్యంగా విద్యా రంగంలో మునుపెన్నడూ లేని విప్లవాత్మక మార్పులకు నాంది పలికారని గుర్తు చేశారు. ప్రోత్సాహకాలు, సత్కారాలు వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందింపజేస్తాయని, తద్వారా మరింత మెరుగైన ఫలితాలను రాబట్టవచ్చని చెప్పారు.

**రూ.1.10 లక్షల ప్రోత్సాహకాల అందజేత**

పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులు, కళాశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు రూ.1.10 లక్షల ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల సుందరమ్మ, జెడ్పీటీసీ సభ్యులు గాదెల వెంకటేశ్వరరావు, అమర్లపూడి కీర్తి సౌజన్య, ఎంఈవో బాలాజీ నాయక్, తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, హెచ్ఎం విజయలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం



సీసీ రోడ్లకు భూమిపూజ చేస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట: పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని చెరువు బజారులో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, పైప్‌లైన్ నిర్మాణ పనులకు గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని 30 వార్డుల్లో డ్రైనేజీలు, సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏ వార్డులో కూడా మట్టి రోడ్లు లేకుండా సీసీ రోడ్లకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అందుకోసం కులాలు, పార్టీలకతీతంగా రోడ్డు నిర్మాణాలతో పాటు పట్టణ ప్రజల సమస్యలను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఊర చెరువు అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా పార్కు నిర్మాణాలు చేపట్టనున్నామని తెలిపారు. మున్సిపల్ అధికారులు కూడా ఎప్పటికప్పుడు వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలు సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, కౌన్సిలర్‌లు కొలగాని రాము, తన్నీరు నాగమణి, విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ డైరెక్టర్ నంబూరి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు బద్దు నాయక్, పుల్లయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### మహిళల రక్షణకే దిశ యాప్



బోదవాడ(వీరులపాడు): మహిళల రక్షణకే ప్రభుత్వం దిశ యాప్‌ను రూపొందించిందని ఎస్ఐ మహాలక్ష్మడు అన్నారు. మండలంలోని బోదవాడ గ్రామంలో దిశ యాప్‌పై గురువారం మెగా డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా రహదారిపై రాకపోకలు చేసే మహిళలను ఆపి దిశ యాప్‌పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత ప్రభుత్వ బాధ్యత అన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు విధిగా తమ ఫోన్‌లలో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. దిశ యాప్ ఉంటే పోలీసుల భద్రతా వలయంలో సురక్షితంగా ఉన్నట్లేనని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగేశ్వరరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

### కోనేరుకు పూర్వ వైభవం తెస్తాం



నందిగామ: కోనేరుకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని రామలింగేశ్వర స్వామి వారి ఆలయ ఈవో సీతారామయ్య తెలిపారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయానికి చెందిన కోనేరు వద్ద ఇటీవల ఆక్రమణలు తొలగిస్తున్న సమయంలో పురాతన శివాలయం బయటపడ్డ సంగతి పాఠకులకు విదితమే.ఈ నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం కోనేరు మరమ్మతులు ప్రారంభించారు. తాజాగా గురువారం కోనేరు చుట్టూ ఉన్న ప్రాంతాన్ని క్రేన్‌ల సహాయంతో చదును చేసే కార్యక్రమం ప్రారంభించారు. పనులు పర్యవేక్షించిన అనంతరం ఈవో మాట్లాడుతూ కోనేరుకు చెందిన భూమిని సర్వే చేయించి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కోనేరుకు పూర్వవైభవం వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

# మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



సీసీ డ్రైన్, కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: పట్టణ ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించటమే తమ లక్ష్యమని శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని 19వ వార్డు పరిధిలో అనాసాగరం ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న సీసీ డ్రైన్, కల్వర్టు నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని 20 వార్డులలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ముఖ్యంగా ప్రాధాన్యతాక్రమంలో అన్ని వార్డులలో సీసీ రోడ్లు, డ్రైన్‌లు నిర్మిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అనాసాగరం పరిధిలోని ఒకటి, 19, 20 వార్డులలో ఇప్పటికే వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్, ఓపెన్ జిమ్, ప్రత్యేక వాటర్ పైప్‌లైన్‌తో పాటు సీసీ రోడ్లు, డ్రైన్‌లు నిర్మించామని చెప్పారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ.కోటి నిధులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దటంతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించామని తెలిపారు.

**అనాసాగరం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు**

అనాసాగరం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవటంతో పాటు రానున్న రోజుల్లో మరిన్ని నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు చెప్పారు. చంద్రబాబు పాలనలో మాదిరిగా శంకుస్థాపనలు చేసి శిలాఫలాకాలతో చేతులు దులుపుకోకుండా శంకుస్థాపన చేసిన ప్రతి ఒక్క పనిని వేగంగా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మందా మరియమ్మ, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ కమిషనర్ జయరాం, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన వైద్య సేవలు అందించండి

డీఎంహెచ్ఓ సుహాసిని



వైద్యులకు సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని పేర్కొన్నారు. ఆమె గురువారం విజయవాడ రూరల్ మండపంలోని ఎనికేపాడు1 విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ప్రోగ్రామ్‌లో ప్రతిపాదించిన ప్రతి సేవను ప్రజలకు చేరవయ్యేలా వైద్యం అందించాలని పేర్కొన్నారు. అక్కడికి వైద్య సేవల కోసం వచ్చిన వారితో మాట్లాడారు. మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలు, మందుల వివరాలు తెలుసుకున్నారు. వైద్య సేవలు అందిస్తున్న తీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సమీపంలోని ఎలిమెంటరీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల సరఫరా, పంపిణీని పరిశీలించారు. ఆ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులకు అందిస్తున్న పోషకాహారం పంపిణీ, పిల్లలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ ద్రావణం పంపిణీ, అందుబాటుపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### మత సామరస్యానికి ప్రతీక షాబూఖారీ దర్గా



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఆసీఫ్ అల్తాఫ్‌రాజా తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మత సామరస్యానికి ప్రతీక షాబూఖారీ దర్గా అని కర్నాటక రాష్ట్రంలోని మైసూర్ టిప్పుసుల్తాన్ దర్గా కమిటీ చైర్మన్ ఆసీఫ్ సేట్ మేమన్ అన్నారు. కొండపల్లిలోని షాబూఖారీ దర్గాను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్థాన పీఠాధిపతి, మత గురువు మహ్మద్ అల్తాఫ్‌రజా ఆయనకు ఘన స్వాగతం పలికారు. మైసూర్ నుంచి తెచ్చిన చాదర్‌ను బాబాకు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంతో ప్రసిద్ధి గాంచిన దర్గా సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ జరుగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమం ఎంతో గొప్పదన్నారు. మహ్మద్ సుభాని, జాకీర్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# దశాబ్దాల కల నెరవేరిన వేళ...

రహదారి నిర్మాణంతో ప్రజల హర్షం



పూర్తయిన రోడ్డు నిర్మాణం

నవాబుపేట(పెనుగంచిప్రోలు): మండలంలోని నవాబుపేట గ్రామం నుంచి జగ్గయ్యపేట మండలం జయంతిపురం వరకు తారురోడ్డు నిర్మాణం చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ద్వారానే సాధ్యమైందని అంటున్నారు. ఉదయభాను 1999లో ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నవాబుపేట-పోచంపల్లి రోడ్డు నిర్మాణం ప్రతిపాదన వచ్చింది. 2004లో ప్రతిపాదన దశ నుంచి నిధుల మంజూరుకు అంచనాల దశకు వచ్చింది. తరువాత వచ్చిన ప్రభుత్వాలు దాని గురించి పట్టించుకోలేదు. 2019లో తిరిగి ఎమ్మెల్యేగా ఉదయభాను వచ్చిన తరువాత ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన్(పీఎంజీఎస్‌వై) పథకం కింద రోడ్డు నిర్మాణానికి నవాబుపేట నుంచి జయంతిపురం వరకు పెంచి 11.6 కిలోమీటర్లు సుమారుగా రూ.6 కోట్లతో పూర్తి చేశారు. దీని ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు దూరం తగ్గటమే కాకుండా పొలాలకు వెళ్లాలన్నా, సరుకు రవాణాకు కూడా ఉపయోగంగా ఉంది.

**ఎంతో ఉపయోగం**



గతంలో నవాబుపేట గ్రామస్తులు కొణకంచిలోని బ్యాంక్‌కు వెళ్లాలంటే జాతీయ రహదారిపై నుంచి వెళ్లాల్సి వచ్చేది. ఈ రోడ్డు నిర్మాణంతో నాలుగు కిలోమీటర్లు తగ్గింది. రైతులకు కూడా ఈ రోడ్డు వలన ఎంతో ఉపయోగం. వాహనదారులు నిత్యం ఎంతో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై ప్రయాణించకుండా ఈ రోడ్డు ఉపయోగకరంగా ఉంటుంది.

–నంబూరి వాసు, నవాబుపేట

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బీమా నగదు అందజేస్తున్న విప్ ఉదయభాను

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. గ్రామానికి చెందిన తీర్ధాల భవాని గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. వైఎస్సార్ బీమా కింద తక్షణం మంజూరైన రూ.10 వేలు గురువారం భవాని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.జ్యోతి బ్రహ్మం, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, కోలా రామారావు, వేల్పుల రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



బోదవాడ గ్రామంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

బోదవాడ(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని బోదవాడ గ్రామంలో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించటంతో పాటు ప్రజా సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందించటంతో పాటు నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కానీ, ఏ ప్రజాప్రతినిధి కానీ మేం ఇది చేశామని చెప్పుకుంటూ ప్రజల ముందుకు వెళ్లిన దాఖలాలు లేవని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తాము ఇది చేశాం అంటూ ప్రజల ముందుకు సగర్వంగా వెళ్తున్నామన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉంటే పాలన ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని అన్నారు. చంద్రబాబు ఇచ్చే బూటకపు హామీలను నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ శీలం సంధ్య, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, నాయకులు శీలం భాస్కర్‌రెడ్డి, యాదాల దాసు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కర్ల రాణి, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతికి పోస్టల్ ద్వారా శుభాకాంక్షలు చెప్పే సౌకర్యం

జగ్గయ్యపేట అర్బన్: భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము జన్మదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోస్టల్ సర్కిల్ రాష్ట్ర పౌరులకు రాష్ట్రపతికి శుభాకాంక్షలు చెప్పే సౌకర్యం కల్పిస్తున్నట్లు నందిగామ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాష్ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రజలకు వారి ఆదర్శ వ్యక్తులకు చేరువ చేయడమే లక్ష్యంగా తపాలా శాఖ ఈ-పోస్ట్ మెసేజ్‌ల సేవ ద్వారా ఈ అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. ఈనెల 20వ తేదీన రాష్ట్రపతి జన్మదినం సందర్భంగా ప్రజలు తపాలా శాఖలోని ఈ-పోస్టు సందేశాల ద్వారా తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియపరచవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు సమీపంలోని పోస్టాఫీసును సందర్శించి రూ.10 చెల్లించి ఈ-పోస్ట్ సందేశాల శుభాకాంక్షలు తెలియజేయవచ్చునన్నారు. అందుకు ఈనెల 18 వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు.

# మహిళలకు ఆపద్బంధువు దిశ యాప్



పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ జనార్ధన్‌నాయుడు

పెనుగంచిప్రోలు: ఆపదలో ఉన్న మహిళలను తక్షణం ఆదుకునేందుకు దిశ యాప్ రక్షణగా పని చేస్తుందని నందిగామ ఏసీపీ కె.జనార్ధన్‌నాయుడు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో గురువారం రాత్రి పోలీసు సిబ్బంది సెల్‌ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణే ధ్యేయంగా దిశ యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందన్నారు. బాలికలు, మహిళలు, యువతులపై వేధింపులు, దాడులు జరిగినప్పుడు నేరుగా దిశ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్ఐ సీహెచ్‌కే దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### పోక్సో కేసు నమోదు

పెనుగంచిప్రోలు: మైనర్ బాలికను నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొళ్లికుళ్ల గ్రామానికి చెందిన రెక్కల శ్రీనివాస్ గ్రామానికే చెందిన మైనర్ బాలికను గత కొంతకాలంగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసం చేశాడు. దీనిపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశారు. జగ్గయ్యపేట సీఐ ఎం.జానకిరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.